జగనన్న విద్యాకానుక సిద్ధం

- ఇప్పటికే మండల వనరుల కేంద్రాలకు చేరిన కిట్లు
- జూన్ 10 నాటికి పాఠశాలలకు చేరేలా ఏర్పాట్లు
- నియోజకవర్గంలో 246 స్కూళ్లలో 31,158 మంది విద్యార్థులు
- స్కూల్ తెరవగానే పంపిణీ చేసేందుకు చర్యలు



మద్దికెర మండల విద్యాధికారి కార్యాలయానికి చేరుకున్న విద్యాకానుక కిట్లు

మద్దికెర : ఆర్థిక ఇబ్బందులు కారణంగా ఏపేద విద్యార్థి పాఠశాలలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అన్ని రకాలు విద్యాసామగ్రిని జగనన్న విద్యాకానుక పేరుతో విద్యార్థులకు అందిస్తోంది. ఇందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా అందిస్తున్న విద్యా కానుక కిట్లు ఇప్పటికే మండల వనరుల కేంద్రాలకు చేరాయి. వీటిని ఆయా పాఠశాలలకు చేర్చి.. స్కూల్ ప్రారంభం రోజునే విద్యార్థులకు అందజేసేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

పాఠశాలలకు తరలించేందుకు ప్రణాళికలు

గత ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కేవలం పాఠ్య పుస్తకాలు మాత్రమే ఇచ్చేవి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు స్కూలు బ్యాగు, షూస్, సాక్స్, నోట్ బుక్స్, బెల్టు వంటి వాటిని 'జగనన్న విద్యాకానుక కిట్' పేరుతో అందిస్తున్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సరిపడ విద్యాకానుక కిట్లు ఇప్పటికే మండల వనరులు కేంద్రాలకు చేరాయి. జూన్ 10 వతేదీ నాటికి వాటిని ఆయా పాఠశాలలకు తరలించడానికి విద్యాశాఖాధికారులు ప్రణాళిక రూపొందించారు. ఏపీ పాఠశాలలకు ఎన్నెన్ని పంపించాలో తరగతుల వారీగా ఆయా పాఠశాలల విద్యార్థుల సంఖ్యను బట్టి మండల కేంద్రాల్లో కిట్లు సిద్ధం చేస్తున్నారు. పత్తికొండ నియోజకవర్గంలో 167 ప్రాథమిక పాఠశాలలు, 28 ప్రాథమికోన్నత, 61 ఉన్నత పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు 31,158 మంది విద్యార్థులు వున్నారు. వారందరికి జగనన్న విద్యాకానుక కిట్లు అందించనున్నారు.

నియోజకవర్గంలో మండలాల వారీగా ప్రభుత్వ పాఠశాలల వివరాలు

మండలం	ప్రైమరీ స్కూళ్లు	యూపీ స్కూల్స్	హైస్కూళ్లు	మొత్తం స్కూళ్లు	మొత్తం విద్యార్థులు
మద్దికెర	19	01	06	26	3,376
తుగ్గలి	44	12	10	66	7,715
పత్తికొండ	29	08	10	47	9,584
కృష్ణగిరి	31	04	11	46	7,360
వెల్దుర్తి	44	03	14	61	9,123
మొత్తం	167	28	61	246	31,158

ఏ వస్తువూ కొనాల్సిన పనిలేకుండా..

ప్రతి జగనన్న విద్యాకానుక కిట్లలో ఒక స్కూలు బ్యాగు, ఒక బెల్టు, ఒక జత షూస్, రెండు జతల సాక్స్, మూడు జతల యూనిఫాం, మూడు సెట్ల నోట్ పుస్తకాలు (ఒక సెట్‌లో 6 పుస్తకాలు), ఒక సెట్ పాఠ్య పుస్తకాలుంటాయి. దీంతో విద్యార్థి విద్యా సంవత్సరం పొడువునా నోట్ పుస్తకాలు కానీ, పాఠ్య పుస్తకాలు కానీ, ఏ వస్తువూ కొనే పని వుండదు. ఆమేరకు విద్యార్థులకు ఆర్థిక భారం తగ్గుతుంది.



విద్యార్థులకు అందజేసే విద్యాకానుక కిట్లు

అంతా సిద్ధం చేస్తున్నాం



వచ్చే విద్యా సంవత్సరంలో మండలంలోని విద్యార్థులు అందరికి సరిపడా జగనన్న విద్యాకానుక కిట్లు ఇప్పటికే వచ్చాయి. ఈ ఏడాది ముందుగానే ప్రభుత్వం వాటిని సిద్ధం చేసింది. జూన్ 12న పాఠశాలలను తెరుస్తారు. జూన్ 10 వతేదీ నాటికి రెండు రోజులు ముందుగానే అన్ని పాఠశాలలకు విద్యా కానుక కిట్లు తరలించేందుకు ఏర్పాట్లు చేశాం. ఉన్నతాధికారులు ఆదేశాల ప్రకారం సకాలంలో విద్యార్థులకు వాటిని అందిస్తాం. **– రంగస్వామి, ఎంఈఓ**

కనుల పండువగా పల్లకీ సేవ

మంత్రాలయం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో బంగారు పల్లకీ సేవ ఆదివారం కనులపండువగా సాగింది. స్వామివారి వెండి బృందావన ప్రతిమను పల్లకీలో కొలువుదీర్చి ప్రాకారంలో వేలాది మంది భక్తుల మధ్య ఊరేగించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామివారి పల్లకీసేవను దర్శించుకున్నారు. అనంతరం భక్తులు గ్రామదేవత మంచాలమ్మ, స్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో మఠం కిటకిటలాడింది.

చిరుత దాడిలో మేక మృతి

కోసిగి: మండల పరిధిలోని గొడగల్లు గ్రామ సమీపంలోని కొండ ప్రాంతంలో గొర్రెల, మేకల మందపై శనివారం రాత్రి చిరుత పులి దాడి చేసింది. దాడిలో కోసిగికి చెందిన వక్రాని దస్తగిరి మేకను చిరుత పట్టుకుని కొండలోకి పరుగులు తీసింది. గమనించిన గొర్రెల కాపరులు అరుపులు, కేకలు వేయడంతో మేకను అక్కడి వదిలేసి వెళ్లిందని గొర్రెల కాపరులు తెలిపారు. బాధితులు ఫారెస్ట్ ఆఫీసర్‌లకు సమాచారం ఇవ్వడంతో ఆదివారం ఉదయం పశువైద్యాధికారి సంతోష్ కుమార్ గ్రామానికి చేరుకుని పోస్టుమార్టం చేశారు. చిరుత దాడి వలన మృతి చెందినట్లు నిర్ధారించారు. కుప్పగల్ బీట్ ఆఫీసర్ షమిఉల్లా కేసు నమోదు చేసుకుని జిల్లా ఉన్నత అధికారులకు నివేదిక పంపుతామన్నారు. బాధిత గొర్రెల కాపరికి నష్ట పరిహారం వచ్చేలా చూస్తామన్నారు. అయితే కొండ ప్రాంతాల్లో గొర్రెల మందను ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. చిరుతలకు హాని కలిగించరాదని సూచించారు.

క్లుప్తంగా

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

కృష్ణగిరి: ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందిస్తున్న వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు ఆదివారం కోరారు. సోమవారం నుంచి అన్ని ఆర్‌బీకేల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు విత్తనాలు అందిస్తామని తెలిపారు. ఇప్పటికే అన్ని ఆర్‌బీకేలకు విత్తనాలు చేరుతున్నాయని, ముందుగా నమోదు చేసుకున్న రైతులకు అందిస్తామన్నారు. వేరుశనగ విత్తనాలతోపాటు కంది, కొర్ర విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయని అవసరమైన రైతులు ఆర్‌బీకేల్లో నమోదు చేసుకుని తీసుకోవాలన్నారు. మండలంలో అత్యధికంగా అమకతాడు, కంబాలపాడు, పోతుగల్లు, ఎరుకలచెరువు గ్రామాల్లో విత్తనాల కోసం ఎక్కువ మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు.

రాష్ట్రపతిని అవమానించడం తగదు



ఆందోళన చేస్తున్న నాయకులు

పత్తికొండ రూరల్ : దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపది ముర్మును బీజేపీ ప్రభుత్వం అవమానించడం తగదని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుదాస్, జిల్లా కార్యదర్శి మహేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి భీమలింగప్ప అన్నారు. ఆదివారం డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో స్థానిక చదువుల రామయ్య భవన్ నుంచి అంబేడ్కర్ కూడలి వరకు కళ్లకు రిబ్బన్లు కట్టుకుని ర్యాలీ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. దేశ రాజధానిలో నూతనంగా నిర్మించిన పార్లమెంట్ భవనం ప్రారంభోత్సవానికి దేశ ప్రథమ పౌరురాలిని ఆహ్వానించకపోవడం సిగ్గుచేటన్నారు. అవమానించిన దేశ ప్రధాని మోదీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారం



నారాయణ

ఆలూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గుమ్మనూరు నారాయణ సోమవారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి గుమ్మనూరు జయరాం హాజరుకానున్నారు. కార్యక్రమం అనంతరం మంత్రి నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులతో 30న సీఎం పత్తికొండ పర్యటనపై సమీక్షిస్తారు. కార్యక్రమానికి అన్ని మండలాలకు చెందిన వారు హాజరుకావాలని మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ కోరారు.

నేడు 'స్పందన'

నందవరం : సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం స్పందన కార్యక్రమం నిర్వహిస్తుందని ఎంపీడీఓ కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్పందన కార్యక్రమాన్ని రైతులు, ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి మండలంలోని ఆయా శాఖల అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని సూచించారు.

రేపు సెమినార్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కుర్ణి కళ్యాణ మండపంలో మంగళవారం ఉదయం భారత రాజ్యాంగం సామాజిక మార్పు- సవాళ్లు అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు స్థానిక పూలే అంబేడ్కర్ ఐడియాలజీ సంస్థ కన్వీనర్ దేవదానం ఆదివారం తెలిపారు. ఇందులో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ ఇ.వెంకటేషు, మల్లెల గ్రూప్స్ అధినేత ఆల్‌ఫ్రెడ్‌రాజు, రిటైర్డ్ వైద్యాధికారి డాక్టర్ బాలయ్య, బీసీ సంఘ జాతీయ కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులుతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

పెద్దమరివీడులో తాగునీటి ఎద్దడి



నీటి కోసం బిందెలతో వేచిఉన్న మహిళలు

గోనెగండ్ల: మండల పరిధిలోని పెద్దమరివీడు గ్రామంలో తాగునీటి సమస్య రోజుకు రోజుకు తీవ్రం అవుతోంది. గ్రామానికి అలువాల ఎస్ఎస్ ట్యాంక్ నుంచే మంచినీరు సరఫరా అవుతుంది. వారానికి ఒకసారి మాత్రమే గ్రామానికి తాగు నీరు సరఫరా చేస్తున్నారని, అది కూడా అరగంట మాత్రమే వస్తున్నాయని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఆదివారం ఉదయం గ్రామానికి నీళ్లు రావడంతో గ్రామస్తులు బిందెలతో మినీ ట్యాంక్‌లు, కొళాయిల దగ్గరకు పరుగులు తీశారు. అరగంట మాత్రమే నీళ్లు సరఫరా కావడంతో మూడు, నాలుగు బిందెలు మాత్రమే దొరి కాయని వాపోయారు. అధికారులు స్పందించి తాగు నీటి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

పల్లెల్లో నీటి ఎద్దడి నివారణకు చర్యలు



జగ్గాపురంలో కొత్త పైపులైన్ నిర్మాణానికి గుంత తవ్వుతున్న జేసీబీ



మిట్టసోమపురం గ్రామానికి తాగునీటి పైపులైన్ వేస్తున్న దృశ్యంవేస్తున్న

నందవరం : వేసవి దృష్ట్యా పల్లెల్లో తాగునీటి ఎద్దడి నివారణ చర్యలో భాగంగా ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ హనుమంతమ్మ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మిట్టసోమపురం, జగ్గాపురం గ్రామాలలో తాగునీటి ఎద్దడి నివారణ చర్యలో భాగంగా నూతన పైపులైన్ నిర్మాణాలు చేపట్టారు. వారు మాట్లాడుతూ..గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సహకారంతో ఎంపీపీ, జెడ్పీటీసీ నిధులు కేటాయించారన్నారు. జగ్గాపురం గ్రామానికి ఎంపీపీ నిధులు కింద రూ.4 లక్షలు, జెడ్పీటీసీ నిధులు రూ.6లక్షలు కేటాయించినట్లు తెలిపారు. అలాగే మిట్టసోమపురం గ్రామంలో ఎంపీపీ నిధుల ద్వారా రూ.7లక్షలు మంజూరు చేశారన్నారు. ఈ పైపులైన్ నిర్మాణం పూర్తిచేసి గ్రామాల్లోని ఓహెచ్ఆర్ ట్యాంకులు, ఆయా కాలనీలో నీటి గుమ్మీలు ఏర్పాటు చేసి నీటి సరఫరా చేస్తామని తెలిపారు. అలాగే ట్యాంకు నుంచి ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ మంజూరు చేసి ఇంటింటికి తాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహులు, కోతి ఈరన్న, నరసరాజు, నరసన్న, లింగన్న, బొజ్జన్న తదితరులు పాల్గొన్నారు.

పేదలకు పోషకాహారం



రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న ప్రభుత్వ మొబైల్ డెలివరీ వాహనం

- జూన్ నుంచి రేషన్ కార్డుదారులకు రాగుల పంపిణీ
- పైలెట్ ప్రాజెక్టుగా రాయలసీమ జిల్లాల ఎంపిక
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

చిప్పగిరి: పేదల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం ప్రజా పంపిణీలో సమూల మార్పులు చేపట్టింది. ఇంతవరకూ అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రమే పరిమితమైన పౌష్టికాహారం ఇప్పుడు రేషన్ కార్డుదారులకూ అందజేస్తోంది. అందులో భాగంగా ఇప్పటికే ఫోర్టిఫైడ్ రైస్, జొన్నలు అందజేస్తుండగా ప్రస్తుతం చిరు ధాన్యాల పంపిణీకి పైలెట్ ప్రాజెక్టుగా రాయలసీమ జిల్లాలు ఎంపిక చేసింది. దీంతో కర్నూలు జిల్లాలో రైస్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి జూన్ నెల నుంచి రాగులు ఉచితంగా అందనున్నాయి.

ప్రతి కుటుంబానికి ఉచితంగా..

జూన్ నెల నుంచి అత్యధిక పోషక విలువలు కలిగిన రాగులను రైస్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం ఉచితంగా అందించనుంది. రైస్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి కేజీ నుండి మూడు కేజీల వరకు అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వీటికి తోడు బియ్యం, కంది పప్పు, చక్కెర, యథావిధిగా అందనున్నాయి. ప్రభుత్వ చర్యలపై రేషన్ కార్డు దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జూన్ నుంచి పంపిణీకి చర్యలు



ప్రభుత్వ అదేశాల మేరకు జూన్ నెల నుంచి రాగుల పంపిణీ చేపడతాం. రైస్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ కేజీ నుంచి 3 కేజీల వరకు ప్రభుత్వ నిబంధనల మేరకు అందిస్తాం. తమ ఇళ్ల దగ్గరికి వచ్చే మొబైల్ డెలివరీ వాహనాల ద్వారా లబ్ధిదారులు ఉచితంగా పొందవచ్చు.
– లక్ష్మీనారాయణ, తహసీల్దార్, చిప్పగిరి

రాగులలో అత్యధిక పోషకాలు



రాగులలో ఐరన్, క్యాల్షియమ్, జింక్ అత్యధికంగా ఉంటుంది. వీటి వలన ఎముకల దృఢత్వం పెరుగుతంది. జీర్ణక్రియ ఉన్నత స్థితికి చేరుకుంటుంది. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో రాగి జావ వేడిని తగ్గిస్తుంది. రాగి జావ, రాగి సంకటి తదితర పదార్థాలు వాడడం ఆరోగ్య కరం.
– మెడికల్ ఆఫీసర్ జమీల్ అహమ్మద్

రోడ్డు బాగు చేయించారు.. ఆదర్శంగా నిలిచారు



హొళగుందలో మార్లమడికి రోడ్డును గ్రావెల్ వేసి చదును చేస్తున్న దృశ్యం

హొళగుంద: ఎవరో వస్తారు.. ఏదో చేస్తారు అని ఎదురు చూడకుండా తమతో పాటు మండల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారిన రోడ్డును గ్రావెల్‌తో బాగు చేసుకున్నారు హొళగుందకు చెందిన బీసీ కాలనీ వాల్మీకి యూత్ సభ్యులు. ఆదివారం యూత్ సభ్యులు కొండ బుడ్డన్న, జంజల్ మల్లేశ్, మహనంది, తుంబలం సిద్దప్ప, నాగప్ప, కుంట సిద్ద, కొరివి గోరేష్, రారావి సిద్ద తదితరులు సొంత ఖర్చులు పెట్టుకుని ట్రాక్టర్లు, పొక్లైన్ ఏర్పాటు చేసి వైఎస్సార్ విగ్రహం నుంచి తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ) వరకు గుంతలు పడిన చోట గ్రావెల్‌తో చదును చేయించి యువతకు ఆదర్శంగా నిలిచారు. దాదాపు కిలోమీటర్ మేర రోడ్డును బాగు చేసుకున్నారు. వీరికి వైఎస్సార్‌సీపీ నాయకుడు పంపాపతి తనవంతు సహకారం అందించారు.

ఆధ్యాత్మికం

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



దేవరగట్టు మాళమల్లేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న పూజారులు

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామి వారం సందర్భంగా పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జలాభిషేకం, మహామంగళారతి, సుప్రభాతసేవ, బండరార్చన, కుంకుమార్చనతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. స్వామిని దర్శించుకునేందుకు గాను కర్ణాటక, ఆంధ్రా ప్రాంతం నుంచి భక్తులు తరలి వచ్చారు. కొందరు భక్తులు మొక్కులో భాగంగా అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. అదేవిధంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆస్పరి మఠంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

సోగనూరులో నేడు ప్రతిష్ఠోత్సవాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని సోగనూరు గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన శివాలయంలో సోమవారం దేవతా మూర్తుల విగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాలు బెలడోణ రామనాథశాస్త్రి ఆధ్వర్యంలో జరుగుతాయని, ప్రతిష్ఠ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దేవుని కృపకు పాత్రులు కావాలని కోరారు.

అభయాంజనేయస్వామి విగ్రహ స్థాపనకు విరాళం



దాతకు రశీదు అందజేస్తున్న గురుస్వామి

వెల్దుర్తి: పట్టణ సమీపంలోని కర్నూలు హైవే క్రాస్ వద్ద నిర్మిస్తున్న 51 అడుగుల అభయాంజనేయస్వామి విగ్రహ స్థాపనకు పట్టణానికి చెందిన బోయ రామచంద్రనాయుడు రూ.15వేల విరాళాన్ని ఆదివారం అందించారు. తన తనయుడు జయసింహ నాయుడు పుట్టిన రోజును పురస్కరించుకుని దాత తన విరాళాన్ని విగ్రహ నిర్మాణ కర్త, గురుస్వామి చెరుకులపాడు రామాంజనేయులుకు అందించారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

కర్నూలు కల్చరల్: ఆధ్యాత్మిక భావాన్ని కలిగి ఉంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని నరసరావుపేట ఇస్కాన్ టెంపుల్ ప్రవచకులు శ్రీనివాస్ ప్రభు అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత తరగతులు నిర్వహించారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భగవద్గీత పఠనం, శ్రవణంతో సమస్యలకు పరిష్కార మార్గాలు దొరుకుతాయన్నారు. చిన్నారులకు చదువుతో పాటు సంస్కారం, నైతిక విలువలు, కుటుంబ విలువలు నేర్పాల్సిన అవసరం ఉందన్నారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనను జయప్రదం చేయాలి

పత్తికొండటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జూన్ 1న పత్తికొండ పర్యటనను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి కోరారు. ఆదివారం పత్తికొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైతు భరోసా కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్న జగనన్నకు ఘనస్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని 5 మండలాల నుంచి పెద్ద ఎత్తున రైతులు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు. సీఎం హోదాలో మొదటిసారిగా పత్తికొండకు వస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పార్టీశ్రేణులతో కలసి ఘనస్వాగతం పలికేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

సీఎం సభను విజయవంతం చేద్దాం

కృష్ణగిరి: పత్తికొండలో వైఎస్సార్ రైతు భరోసా పథకం ప్రారంభించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వస్తున్నారని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన కృష్ణగిరిలో పార్టీ నాయకులతో మాట్లాడారు. మొట్టమొదటి సారిగా సీఎం జగనన్న పత్తికొండ రావడం శుభ పరిణామన్నారు. ఈ సభకు మండల వ్యాప్తంగా రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యేలా అందరు కృషి చేయాలని కోరారు.

సీఎం సభకు తరలిరండి

దేవనకొండ: పత్తికొండలో జరగనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున రైతులు, ప్రజలు, మహిళలు తరలిరావాలని మండల కన్వీనర్ మల్లికార్జున పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గెస్ట్‌లో విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. మండలం నుంచి ప్రజలు, కార్యకర్తలను తీసుకొచ్చే బాధ్యతను వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్, ఎంపీటీసీల సభ్యులు తీసుకోవాలన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకుడు లుమాంబ, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు అరుణకుమార్, మండల కో-ఆప్షన్ మెంబర్ జుబేదార్ తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట గ్రామం వాసుబాబు రైస్ మిల్లు సమీపంలో ఆదివారం ఆర్టీసీ బస్సు, ట్రాలీ ఆటోను ఢీ కొనడంతో ఆటోలో ఉన్న ఆవు మృతి చెందగా, ఇద్దరికి గాయాలు అయ్యాయి. దేవనకొండ మండలం బండగట్టు గ్రామానికి చెందిన పెద్ద నాగన్న ట్రాలీ ఆటోలో ఆవు, కోడెదూడను ఎమ్మిగనూరులో జరిగే పశువుల సంతకు తీసుకువచ్చాడు. పశువుల సంతలో కోడెదూడ విక్రయం కాగా ఆవు సరైన ధర పలకకపోవటంతో ఆటోలో ఆవును తిరిగి ఇంటికి తీసుకెళ్తున్నాడు. రైస్ మిల్లు దగ్గరకు రాగానే కర్నూలు నుంచి ఎమ్మిగనూరుకు వస్తున్న బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాలీ ఆటో నుజ్జ నుజ్జ కాగా, ఆవు మృతి చెందింది. ఆటో డ్రైవర్ రాముడు, పశువుల యజమాని పెద్దనాగన్నలకు తీవ్ర గాయాలు అయ్యాయి. ప్రమాదంలో గాయపడ్డ వారిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతి చెందిన ఆవు విలువ దాదాపు రూ. 20 వేలు పైగా ఉంటుందని బాధితుడి బంధువులు తెలిపారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ట్రాలీ ఆటో

రోడ్డుపై ఆందోళనకు దిగిన స్థానికులు..

రోడ్డు ప్రమాదానికి కారణం ఆర్టీసీ డ్రైవర్ నిర్లక్ష్యమేనని, అతనిపై చర్యలు తీసుకోవాలని బాధితుడి బంధువులతో పాటు స్థానికులు రోడ్డుకు అడ్డంగా కూర్చొని ఆందోళనకు దిగారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. రూరల్ పోలీసులు కలుగచేసుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

డివైడర్‌ను ఢీ కొన్న ఇన్నోవా

ఎమ్మిగనూరురూరల్: పట్టణ సమీపంలోని ఎంజీ పెట్రోల్ బంక్ వద్ద జాతీయ రహదారి (ఎన్‌హెచ్167)పై కర్ణాటకకు చెందిన ఇన్నోవా వాహనం డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. కర్ణాటక రాష్ట్రం బళ్లారి నుంచి మంత్రాలయంకు దర్శనం కోసం వెళ్తుండగా ఈ సంఘటన చోటుచేసుంది. అయితే ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు సురక్షింతంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



ఎంజీ పెట్రోల్ బంక్ సమీంలోని డివైడర్‌ను ఢీ కొట్టి బోల్తా పడ్డ ఇన్నోవా

స్కూటర్లు ఢీ.. ముగ్గురికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి రెండు స్కూటర్లు ఎదురెదురుగా ఢీ కొనడంతో ముగ్గురికి గాయాలు అయ్యాయి. గుడేకల్ నుంచి ఎమ్మిగనూరుకు బైక్‌పై వస్తున్న తిమ్మప్ప, నాగన్నలు.. ఎమ్మిగనూరు నుంచి గుడేకల్‌కు వెళ్తున్న నరసింహులు బైక్ ఎదురెదురుగా ఢీ కొట్టుకున్నాయి. దీంతో రెండు బైక్‌లపై ఉన్న ముగ్గురికి గాయాలు అయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో నాగన్నకు కాలువిరిగింది.

అ'పూర్వ' సమ్మేళనం



అలనాటి ఉపాధ్యాయులతో 1986-87 బ్యాచ్ విద్యార్థులు

మద్దికెర : మిత్రమా కుశలమా అంటూ 1986–87 సంవత్సరంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు 36 ఏళ్ల తరువాత కలుసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఒకరికొకరు పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యనేర్పిన గురువులు గోపాలకృష్ణ, నాగేశ్వరరావు, ఖాజాహుస్సేన్, రాఘవశర్మలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నీలి ప్రసాద్, శ్రీకాంత్‌లాల్, హుస్సేని, మేదరి మల్లి, నారాయణ, దుమ్మా శ్రీను తదితరులు పాల్గొన్నారు.